# చూపున్న మనసు

"**నా**న్నగారు ఇంట్లోలేరు'' అంది రత్నమాల, డోర్‌బెల్ వినిపిస్తే తలుపు తెరచి. వచ్చిందెవరో చూడకుండానే తలుపు వేయబోయింది ఆమె.

'' ఆగు నేను మీనాన్నగారికోసం రాలేదు'' అన్నాడతను.

''మరి...?'' అని ఆమె తలెత్తి చూసింది అతన్ని. అతన్ని చూడంగానే ఆమె సంభ్రమంలో పడిపోయింది. హృదయంలో తటిల్లత మెరిసింది.

''మీరా...?! నేనెవరో అనుకున్నాను. రండి'' అని లోపలకు దారితీసింది రత్నమాల.

''గుర్తుపట్టలేదన్నమాట'' అన్నాడతను లోపలకు వస్తూ.

''గుర్తుపట్టకేం... కూర్చోండి అమ్మను పిలుస్తాను''.

రత్నమాల తల్లిని పిలవటానికి లోపలకు పోబోతుండగానే అన్నపూర్ణ లోపల నుండి ముందుగదిలోకొచ్చింది.

'' ఎవరూ అరవిందా! రా... కూర్చో. మీ మామయ్యగారు బయటకు వెళ్ళారు. ఎప్పుడొచ్చావు? ట్రైనింగయిపోయిందా? అమ్మానాన్నా కులాసానా? మీ చెల్లెలు సునీతకు పురుడొచ్చిందా? మొన్నీమధ్య నేనూ అమ్మాయి వెళ్ళి చూసి వచ్చాం. ఇవాళో రేపో అన్నట్లు చెప్పారట డాక్టర్లు'' అంటూ అల్లుణ్ణి చూసిన ఆనందంతో ప్రశ్నల వర్షం కురిపించింది అన్నపూర్ణ.

ఓ పెద్ద కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్న అరవింద్‌ని ప్రమోషన్ ఇచ్చేముందు నాగపూర్‌లో ఉన్న తమ హెడ్‌క్వార్టర్స్‌కి శిక్షణకు పంపారు కంపెనీవారు. శిక్షణాకాలం మూడు నెల్లు. అతను నాగపూరు వెళ్ళబోయేముందే అతని పెళ్ళయింది. భార్యను పుట్టింట్లోనే ఉంచి నాగపూర్ వెళ్ళిపోయాడు అరవింద్.

పొద్దున్నే ట్రైన్‌దిగి, పెట్టేబేడా ఇంట్లో పడేసి భార్యను చూడాలనే ఆతృతతో హడావుడిపడి ఇక్కడకు వస్తే, రత్నమాల తన్నుచూడకపోయినా, తన గొంతయినా గుర్తుపట్టకపోవడం అతనికి నిరుత్సాహం కలిగించింది. అత్తగారు అల్లుడికి కాఫీ, టిఫెను చెయ్యడానికి వంటిట్లోకి పోంగానే అన్నాడు రత్నమాలతో

''అసలు మనుషుల మొహంవంకే చూడవు? ఇదేం జబ్బు!'' అని

'' ఏం జబ్బో నాకు తెలియదు గాని, అందరి మొహాలవంక చూడటం నాకలవాటు లేదు. చూసినా ఆ మొహాలు నాకు గుర్తుండవు'' అంది రత్నమాల.

''పోన్లే నన్ను గుర్తుపట్టావు, అక్కడకు సంతోషం''

''పొండి, మీరు మరీను, మిమ్మల్ని ఎందుకు గుర్తుపట్టను''

''మొన్న మా తమ్ముడు పలకరించినా గుర్తుపట్టినట్లు మాట్లాడలేదట!''

'' ఎప్పుడో పెళ్ళిలో ఓసారి చూశాను. ఓసారి చూసిన వాళ్ళందరూ గుర్తుంటారా? అయినా 'అన్నయ్య దగ్గరినుండి ఉత్తరాలు వస్తున్నాయా' అనడిగినప్పుడు అతనెవరో తెలిసింది. నేనేం అతన్ని గుర్తుపట్టనట్లు మాట్లాడలేదే''

''మనుషులనుగుర్తించనట్లు ప్రవర్తిస్తే అహంభావం, పొగరు అనుకుంటారు''

''నిజమేలాగుంది, నేను మూడేళ్ళు బి. ఎస్.సి చదివినా నాకు మా కాలేజీలో అదీ నాక్లాస్‌మేట్స్ ఇద్దరుముగ్గురితో తప్ప పరిచయం లేదు. క్లాసుకు టైముకు వెళ్ళటం, పాఠాలు వినటం, ఇంటికి వచ్చెయ్యటం. పరిచయాలు పెంచుకోవాలనీ, కలివిడిగా తిరగాలనీ, లేనిపోని మాటలు మాట్లాడాలనీ నాకుండదు. మొన్నామధ్య మా క్లాసుమేటు ఓ అమ్మాయి బస్టాపులో పలుకరించింది. ' ఎవరీమె నన్ను పలుకరిస్తోంది?' అనుకున్నాను. తర్వాత మాటల్లో తెలిసింది ఆమె నా క్లాసుమేటని. నా ఫ్రెండ్ నీరజ అంటుంది, 'అట్లా ఎవరితో మాట్లాడకపోతే నీకు గర్వం అనుకుంటారే' అని'' అంది రత్నమాల.

'' చూశావా మరి నీ పద్ధతి మార్చుకోవాలి. చుట్టూ గిరిగీసుకుని నువ్వది దాటిరాక, ఇతర్లని అందులోకి ప్రవేశించనీయకపోతే ఎలా?''

''నేనవేమీ ఆలోచించను. ఎవరితోనూ మాట్లాడగూడదని నాకేం ఉండదు. నాకైనేను కల్పించుకుని మాట్లాడాలంటే బెరుగ్గా ఉంటుంది''

అరవింద్ కంప్లైంట్ ఇప్పటిది కాదు 'రత్నమాల మనుష్యులను గుర్తించద'ని పెళ్ళి చూపులప్పటినించి అరవింద్‌కు గునుపుగానే ఉంది. పెళ్ళిచూపుల్లో అరవింద్‌కు రత్నమాల బాగా నచ్చింది. పొడుగ్గా, రివటలా, పచ్చగా ఉన్న రత్నమాల ముఖంలోగల కుదిరిక, కళ అతన్నాకర్షించాయి. పెళ్ళికి ముందు 'ఆమెతో మాట్లాడాలి, ఆమె అభిప్రాయాలు తెలుసుకోవాలి' అని అనుకున్నాడు. రెండు కుటుంబాలు సంప్రదాయకమైనవి కావటం వల్ల ఆమెతో విడిగా మాట్లాడే అవకాశం దొరకలేదు అతనికి. అక్కడికీ తల్లితో అన్నాడు.

''నువ్వు విడిగా మాట్లాడేదేమిటి ఆపిల్లతో, మేం పెద్దవాళ్ళం లేమా, మంచీ చెడూ చూడటానికి'' అని కసిరింది తల్లి అరవింద్‌ని. అయితే అతను తన ప్రయత్నం మానలేదు. కాలేజీ దగ్గర ఆమెను కలిసి మాట్లాడాలని వెళ్ళాడు.

సాయంత్రం కోఠీ విమెన్స్ కాలేజీ వద్ద ఓ అరగంట పడిగాపులుగాచిన తరువాత ఆమె

దర్శనమైంది అతనికి. గేటుముందు నుంచున్నా రత్నమాల అతన్ని పట్టించుకోకుండా తనమానాన తాను బస్టాండుకేసి నడవసాగింది.

''రత్నమాలా!'' అని పిల్చాడు అరవింద్

ఆమె విన్నదో లేదోగాని పట్టించుకోకుండా వెళ్ళిపోసాగింది.

''మిమ్మల్నే రత్నమాలా!'' అని మరోసారి పిల్చాడు అరవింద్.

ఆమె వెనక్కి తిరిగి చూసింది.

''ఎవరు మీరు? ఎందుకు పిల్చారు?'' అందామె ఆశ్చర్యంగా.

''నేను... నేను.. అరవింద్‌ని''

''అరవిందా ఎవరబ్బా'' అందామె ఇంకా ఆశ్చర్యం నుంచి కోలుకోకుండా.

''నన్ను గుర్తుపట్టలేదా?''

''ఏమో, మిమ్మల్ని ఇంతకు ముందు చూసినట్టులేదు''

''అయ్యో! నేనండీ...మొన్న పెళ్ళి చూపులకొచ్చిన అరవింద్‌ని.''

అప్పుడు చూసింది అతనివంక నిశితంగా.

''ఓ సారీ. చూడగానే పోల్చలేకపోయాను'' అందామె నొచ్చుకుంటూ.

''పోనీలెండి దాందేముంది. మీరు నాకు చాలా బాగా నచ్చారు. మీతో రెండు మాటలు మాట్లాడదామని వచ్చాను. పెళ్ళిచూపుల రోజున కుదరలేదు'' అన్నాడు అరవింద్.

''ఏం మాట్లాడాలి?'' అందామె బెరుగ్గా.

''అలా డైరెక్ట్‌గా అడిగేస్తే ఎలా? కాసేపు ఏ హోటల్లోనయినా కూర్చుని మాట్లాడుకుందాం''

''అమ్మో! అమ్మ నాకోసం ఎదురు చూస్తుంటుంది. నే వెళ్ళాలి.''

''మరెలా? మీ ఇల్లు నారాయణగూడ లోనే కదా. నడుస్తూ మాట్లాడుకుందాం. మీకేం అభ్యంతరం లేకపోతే నడువగలరా?''

''సరే'' అని తల ఊపింది రత్నమాల ఏమీ అనలేక.

సుల్తాన్ బజారు జనసమ్మర్దంలో నడవటమే కష్టంగా ఉంటే మాటలు సాగలేదు. ఈ లోపల ఎవరేనా తమని చూస్తారేమోననే భయంతో కాచీగూడా చౌరస్తాదాటినా ఏం మాట్లాడలేకపోయాడు అరవింద్. ఆమె ఇల్లు దగ్గరపడుతోందన్న తొందరలో మొదటి మాటగా చివరి మాట అడిగేశాడు అరవింద్.

'' ఇది చెప్పండి నేను మీకు నచ్చానా?'' అని

రత్నమాల అతనివంక చూసి తలతిప్పేసుకుంది. మాట్లాడలేదు.

''చెప్పండి మీ ఇల్లు దగ్గరపడుతోంది.''

''మా అమ్మా వాళ్ళందరకూ నచ్చారు మీరు''

'' అబ్బ, వాళ్ళ సంగతి కాదు మీ సంగతి చెప్పండి''.

''నాసంగతేముంది? వాళ్ళకినచ్చితే నాకు నచ్చినట్లుకాదా?''

''సగటు ఆడపిల్లలా మాట్లాడారు''

'' ఆడపిల్లలు ఇంకెలా చెప్తారో కూడా తెలియదులాగుంది మీకు, వస్తా'' అని అతనివేపోసారి చూసి గేటు తీసుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది రత్నమాల.

అల్లుడు హైదరాబాదులో స్థిరపడడంతో కూతురికి చీరెసారెలు పెట్టి కాపురానికి పంపించారు రత్నమాల తల్లిదండ్రులు. భార్య అన్నివిధాలా నచ్చింది అతనికి. సంసారం చీకు చింతల్లేకుండా హాయిగా గడపగలిగే లక్షణాలన్నీ ఉన్నాయి ఆమెలో. అయితే అరవింద్‌కు ఆమె పట్ల ఉన్న ఫిర్యాదు ఒక్కటే ' ఇల్లన్న తరువాత స్నేహితులు, పరిచయస్తులు, బంధువులు వస్తూ ఉంటారు. ఎవరు ఎవరో గుర్తుంచుకోక పోతే ఎలా?' అని.

''సభ్య సమాజంలో బతికేటప్పుడు మనం నలుగురి స్నేహం చేయాలి. వాళ్ళకి సాయం చేయాలి. వాళ్ళ సాయం పొందాలి. నువ్వు మనుషులనే గుర్తుపెట్టుకోకపోతే ఎలా? ఒకసారి మన ఇంటికి వచ్చినవాడు మళ్ళారాడు'' అంటూ ఉండేవాడు అరవింద్ భార్యతో.

''సాయం చెయ్యటానికీ, సాయం పొందటానికీ నాకభ్యంతరం లేదండీ. నేను కావాలని గుర్తు పెట్టుకోకపోవటమేం లేదు. ఎప్పుడో ఓసారి చూసిన వాళ్ళను గుర్తుపెట్టుకోకపోవటం ఎవ్వరికయినా సహజం'' అంటుండేది రత్నమాల.

ఓసారి అరవింద్ స్నేహితుడు ప్రసాద్ ఊరినుండి తిన్నగా అరవింద్ ఇంటికి వచ్చాడు పెట్టేబేడాతో . అత్తామామా ఎవరింటికో పెళ్ళికి వెళ్ళారు. మరిది ఇంకా కాలేజీనుంచి ఇంటికి రాలేదు. ఒకటి రెండు సార్లు ప్రసాద్ తమ ఇంటికి వచ్చినా పరిశీలనగా చూడకపోవడం వల్ల రత్నమాల అతన్ని గుర్తుపట్టలేదు. అతను తను ఫలానా అని చెప్పటానికి ఇబ్బంది పడ్డాడు. 'తన్ను అదివరకు చూసిన ఆమె గుర్తించకపోవడమేమిటీ? అరవింద్ భార్య అదోరకం మనిషి' అనుకుని వెనుదిరిగేంతలో అరవింద్ తమ్ముడు రవి కాలేజినుండి వస్తూ అతన్ని గుర్తుపట్టి లోపలకు తీసుకుపోయాడు. అతనెవరో తెలిసిన తరువాత రత్నమాల ఆతిథ్యంలో ఏ లోటూ చేయలేదు.

అరవింద్‌కు ఆ విషయం తెల్సి భార్యని తీవ్రంగానే మందలిచాడు.

''ప్రసాద్‌ను ఇంతకు ముందు చూశావుగా గుర్తుపట్టికూడా వాడిని పలుకరించేదేమిటన్న అహంకారమా?'' అని.

''అయ్యో అతను మీ ఫ్రెండ్ అని తెలిస్తే ఎందుకుండమనను. మీకోసం పది మంది

వస్తుంటారు. అందర్నీ మీరు మాత్రం ఉండమంటున్నారా? ఇతన్ని నేను గుర్తుపట్టలేదు. అతను మాత్రం చెప్పొచ్చుగా తను ఫలానా అని'' అంది రత్నమాల.

''సర్లే నీ మతిమరుపుతో నాకు పరువుపోయే రోజులొచ్చాయి'' అన్నాడతను విసుక్కుంటూ.

ఓ రోజు సాయంత్రం అరవింద్ ఇంటికొచ్చేటప్పటికి, ఇంటిముందు వరండాలో చాప పర్చుకుని కూర్చుని ఎవరో పిల్లాడికి లెక్కలు చెప్తోంది రత్నమాల. భర్త వచ్చాడని ట్యూషన్ ముగించి ఆమె లోపలకు రాగానే అడిగాడు అరవింద్, 'వాడెవడు, తీరిగ్గా కూర్చుని పాఠం చెపుతున్నావు' అని.

''మన పనిమనిషి రాములమ్మ కొడుకండీ. టెంత్‌క్లాసు లెక్కల్లో రెండుసార్లు తప్పాడట. రాములమ్మకి ట్యూషన్లు పెట్టే తాహతు లేదు. 'మా పోరడికి రెండు ముక్కలు చెప్పమ్మా' అని బతిమలాడింది. పొద్దే ఖాళీగానే ఉన్నాను కదా అని రోజూ సాయంత్రం రమ్మన్నాను. ఆ స్కూల్లో ఏం చెప్పారోగానీ వాడికి బేసిక్సే తెలియవు. పిల్లవాడు తెలివిగల వాడే. చెప్తే అర్ధమవుతోంది. రోజూ వచ్చి నేర్చుకోమన్నాను'' అంది రత్నమాల.

'' ఎందుకీ అలగా జనమందర్నీ చేర్చటం. పాలేళ్ళకీ, పనిమనుషులకీ సాయం చేసి ప్రయోజనమేంటీ?'' అన్నాడతను.

'' ఏమో బాబూ నాకు ప్రయోజనాలు కనబడవు, మనుషుల అవసరాలుతప్ప'' అంది ఆమె.

''అదేంట్రా అట్లా అంటావు ఏదో బీద మనిషి సాయం చేయమని అడిగింది. కోడలూ ఖాళీనే గదా. ఓ గంట వాడికి పాఠం చెప్తే మనకి పోయేదేముంది'' అన్నాడు అక్కడే సోఫాలో కూర్చుని చుట్టతాగుతున్న అరవింద్ తండ్రి రామారావు.

''సరే.. సరే మీకు నచ్చితే నాకు మాత్రం అభ్యంతరమెందుకు?'' అన్నాడు అరవింద్.

అత్తగారివైపు బంధువుల్లో 'రత్నమాల మనుష్యుల్ని గుర్తించదు, పలుకరించదు, ఆమెకు గర్వం' అని వాడుక పడిపోయింది. ఓ సారి అత్తగారు కూడా అంది. ''అదేంటే అమ్మాయి, మొన్న మా చెల్లెలు గుడ్డల షాపులో కనిపించి పలకరిస్తే పలకలేదట'' అని.

''అవును మొన్న చీరె కొనటానికి వెళ్ళినప్పుడు ఆవిడెవరో పలుకరించారు, 'అరవింద్ రాలేదా?' అని 'లేదు. ఆయనకు ఆఫీసులో తీరికలేక రాలేదు' అని జవాబు చెప్పానే'' అంది రత్నమాల.

'' ఎవరో కాదే అది మా చెల్లెలు పార్వతి''

''అవునా? నేను గుర్తుపట్టలేదండీ'' అంది నొచ్చుకుంటూ రత్నమాల.

''అట్లాగంటే ఎలాగమ్మాయి! గర్వం, పొగరు, శాణీతనం అనుకుంటారు. అందాకా ఎందుకు,

మొన్న అరుణ్ బారసాలకు వచ్చిన సునీత అత్తగారు కూడా అంది, ' ఏవమ్మా! మీ కోడలుకు గర్వమా పలకదేమని!''

''సారీ అత్తయ్యా! పలకరించకూడదని నేనేం అనుకోలేదు. అంతమంది బంధువుల్లో ఆమె ఎవరో గుర్తించని మాట నిజమే. ఆవిడెవరో సునీత చెప్పింతరువాత నేనేం ఆవిడకు మర్యాద తక్కువచేయలేదే''

''ఆమాటా అందనుకో. ఏమయినా దగ్గరవాళ్ళను గుర్తుపట్టటం, పలకరించటం నేర్చుకో,'' అని హితబోధ చేసింది అత్తగారు.

ఇదో పెద్ద చిక్కయిపోయింది రత్నమాలకు. 'అందరూ తనను మనిషుల్ని గుర్తు పెట్టుకోదు, పలకరించదంటారు. పుట్టింట్లో తన తల్లీ, దండ్రీ అప్పుడప్పుడూ అలా అని తనను మందలించినా ఆమె అంతగా పట్టించుకోలేదు. అత్తగారింట్లో అలా కుదిరేటట్లులేదు. వచ్చిన ముఖాలనన్నింటినీ స్టడీ చేయాల్సి వచ్చేటట్టుంది' అనుకుంది దిగాలుగా రత్నమాల.

అరవింద్, రత్నమాల మొదటి ఆట సినిమాకు బయలుదేరారు. ఎప్పుడో కాని సినిమాకు వెళ్ళటం కుదరదు అరవింద్‌కు. ఆఫీసులో పనివుండి, ఇంటికి రావటం ఆలస్యమయ్యేది. అందువల్ల పెద్ద ప్రయత్నంమీద ముందు ఇంటికొచ్చి భార్యను సిద్ధం చేయించి ఉత్సాహంగా సినిమాకు బయలుదేరాడు.

సినిమాహాలు దగ్గరే అవటంతో ఇద్దరూ నడవసాగారు. రోడ్డుమీద రద్దీలేదు. చూస్తుండగానే క్షణంలో దారుణం జరిగిపోయింది. ఎదురుగా వస్తున్న కారుని తప్పుకోవటానికి పక్కకు తిరిగిన ఆటో రిక్షాను తాకి పక్క సందులోకి తిరిగి మాయమయింది. రిక్షా పక్కకు పడిపోయింది. రిక్షాలో కూర్చున్న ముసలమ్మ తల పేవ్‌మెంటుకు గుద్దుకుని గాయమై రక్తం కారసాగింది. చేతులూ కాళ్ళు గీరుకుపోయాయి. రిక్షా కుడి చక్రం నజ్జునజ్జయిపోయింది. జనం చుట్టూ మూగారుగానీ, ఎవరూ ముసలమ్మని లేవనెత్తే ప్రయత్నం చెయ్యలేదు. ఆటోలు, ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం, రాష్ డ్రైవింగ్‌ల మీద వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

రత్నమాల ముసలమ్మను లేప ప్రయత్నించింది. ఆమె లేచే స్థితిలో లేదు.

''రిక్షా పిలవండి. ఈమెను ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. అలా చూస్తూ నిలబడుతారేం'' అంది రత్నమాల భర్తతో అరుస్తున్నట్టు.

అటుగా వెళ్తున్న రిక్షాను పిల్చాడు అరవింద్. జనం సాయంచేసి ముసలమ్మను రిక్షాలో కూర్చోబెట్టారు. రత్నమాల ఆమెను పట్టుకుని తనూ రిక్షాలో కూర్చుంది. ముసలమ్మ గాయం నుండి స్రవించే రక్తంతో రత్నమాల చీరె కూడా తడిసి పోయింది. రిక్షా కదిలి పోతూంటే ఆక్సిడెంట్ అయిన రిక్షా అతను 'తన రిక్షాపాడయిపోయింది రిపేరు చేయించ టానికి ఏమయినా ఇమ్మ'న్నాడు.

''పోవయ్యా! రిక్షా ఎక్కింది ముసలావిడ. ఆక్సిడెంట్ చేసింది ఆటోవాడు. వాళ్ళల్లో ఎవర్నయినా అడుగు. మాకేం సంబంధం'' అన్నాడో ప్రేక్షకుడు.

''అతనికి ఓ ఇరవై రూపాయలివ్వండి'' అంది రత్నమాల భర్తతో.

అరవింద్‌కిదంతా చికాగ్గా ఉంది ఏమనలేక ఇరవై రూపాయలు తీసి ఇచ్చాడు.

రిక్షా కదిలింది. వందగజాల దూరంలో ఉన్న ప్రైవేటు నర్సింగ్‌హోంకు తీసుకెళ్ళారు ముసలమ్మను రత్నమాల, అరవింద్. అది మెడికోలీగల్ కేసని ఆ ముసలమ్మని నర్సింగ్‌హోంలో చేర్చుకో నిరాకరించారు డాక్టరు. డాక్టరు టేబిల్ మీద ఉన్న ఫోనెత్తి నారాయణగూడ పోలీస్ స్టేషనుకు ఫోను చేసి విషయం చెప్పింది రత్నమాల. పోలీస్ ఇన్‌స్పెక్టర్ చెప్పిన మీదటగాని ఆమెను చేర్చుకోలేదు డాక్టరు.

ముసలమ్మను పరీక్షచేసి అన్నాడు డాక్టర్.

''సెలైన్ డ్రిప్ పెట్టాను. తలమీద పెద్ద కన్‌కషన్ అయింది. ఆపరేషను చేయాలి. సర్జన్ని పిలిపిస్తాను. వెయ్యిపైనే ఖర్చవుతుంది. మీలో ఆమె బంధువులెవరైనా ఉన్నారా?'' అని

''మేము ఆమె బంధువులం కాదు డాక్టర్! ఆక్సిడెంట్ అయితే ఆమెనిక్కడకు తీసుకొచ్చాం. మీరు డబ్బు గురించి ఆలోచించకండి. ఆమె బంధువులెవరూ రాకపోతే మేమిస్తాం మీ ఫీజు. నర్సింగ్‌హోం ఛార్జీలు'' అంది రత్నమాల.

డాక్టర్ సర్జన్‌కు ఫోన్ చేయటానికి వెళ్ళాడు.

అరవింద్‌కి ఇదంతా తలనొప్పిగా ఉంది. దారిన పొయ్యే తద్దినాన్ని నెత్తికి తెచ్చుకున్న భార్యమీద గొంతువరకూ కోపమొచ్చింది అతనికి.

'' ఇహపద చేసిన నిర్వాకం చాల్లే'' అన్నాడతను.

''అయ్యో ముసలావిణ్ణి అలా వదిలేసి ఎలా వెళ్తాం'' అంది ఆమె.

'' ఆవిడేం మన బంధువా? ఆమె వాళ్ళొస్తారు. చూసుకుంటారు, నువ్వుపద''

''నేను రాను, మీరూ ఉండరాదూ''

''నువ్వొస్తేరా, లేకపోతే లేదు. నే వెళ్తాను'' అని విసురుగా వెళ్ళిపోయాడు అరవింద్.

అరవింద్ వెళ్ళింతరువాత పోలీసు ఇన్‌స్పెక్టర్ వచ్చి ఆమె స్టేట్‌మెంట్, డాక్టర్ స్టేట్‌మెంట్ తీసుకువెళ్ళాడు. సర్జన్ వచ్చి ముసలావిణ్ణి పరీక్ష చేసి ఆమెకు ఆపరేషన్ చేయాలన్నాడు. రక్తం ఎక్కించాలి. ఆమె బ్లడ్‌గ్రూప్ ఎ.బి. ఆర్ ఎచ్ పాజిటివ్. దొరకటం కష్టం కనక తెలిసినవాళ్ళెవరైనా ఉంటే ప్రయత్నించమన్నాడు నర్సింగ్‌హోం డాక్టరు.

''మావారి బ్లడ్ గ్రూపదే నేను వారికి ఫోను చేస్తాను. మీరు ఆపరేషనుకు సిద్ధం చెయ్యండి డాక్టర్!'' అంది రత్నమాల.

ఆమె ఇంటికి ఫోన్ చేసింది. అరవింద్ ఫోనెత్తాడు భార్య చెప్పింది విని అతనికి మండిపోయింది. ''ఫో నేను రానుపో. దారిన పొయ్యే తద్దినాన్ని నెత్తిన వేసుకున్నది గాక నేను బ్లడ్ కూడా ఇవ్వాలా? ఇవ్వను'' అంటూ ఇకనేం వినిపించుకోకుండా ఫోను పెట్టేశాడు.

రత్నమాలకేం చేయాలో తోచలేదు. తన తండ్రికి కబురు పెడ్తే ఆయన ఏమన్నా వేరే ప్రయత్నం చేస్తాడేమో. తన పుట్టింట్లో ఫోను లేదు. ఇల్లు దగ్గరేగాని ముసలమ్మను వదిలి వెళ్ళటం ఆమెకిష్టం లేదు. ఏం చేయాలా అని ఆలోచిస్తూ కూర్చుండిపోయింది రత్నమాల.

అంతలో వచ్చాడు ఆమె మామగారు రామారావు ఆపద్బాంధవుడిలా.

''ఆయన రాలేదా మామగారూ!'' అడిగింది రత్నమాల ఆతృతగా.

''లేదమ్మా! వాడికి నీమీద కోపంగా ఉంది. నువ్వు వంటరిగా ఉన్నావుకదా అని వచ్చాన నాదీ అదే బ్లడ్ గ్రూపులే. నేనిస్తాలే రక్తం'' అన్నాడు ఆయన.

'' ఈవయసులో బలహీనపడిపోరూ మామగారూ!'' అంది ఆందోళనగా.

'' ఏంఫరవాలేదమ్మా, ఎంత వయసని, మొన్నేగా రిటైరయింది'' అన్నాడు ఆయన.

ఆయన రక్తమివ్వటం, ముసలావిడకు ఆపరేషన్ చెయ్యటం అయ్యేప్పటికి రాత్రి పన్నెండు గంటలైంది. రత్నమాల తిండీ తిప్పలూ లేకుండానే అక్కడ కూర్చుండిపోయింది, మామగార్ని, ముసలమ్మని కనిపెట్టుకుని.

మర్నాడు పొద్దున తెలివి వచ్చిన ముసలమ్మ కొడుకు పేరు చెప్తే డైరెక్టరీ తిరగేసి అతనికి ఫోను చేసింది ఆమె. డైరెక్టరీలో ముసలమ్మకొడుకు నారాయణ రావు అడ్రసు చూస్తే అతను కూడా తన భర్తపనిచేసే కంపెనీలోనే పనిచేస్తాడని అర్థమయింది రత్నమాలకు.

''ఇప్పుడే వస్తున్నా'' అంటూ ఫోను పెట్టేశాడతను.

తర్వాత తమ ఇంటికి ఫోను చేసి భర్తకు చెప్పింది రత్నమాల '' ఆ ముసలావిడ ఎవరో కాదండీ మీ కొలీగ్ నారాయణరావు అని ఉన్నారట కదా! ఆం ఇంజనీరు. ఆయన తల్లే, కూతురింటికెళ్తుంటే ఆక్సిడెంటయింది. చెల్లెలింట్లో ఉందికదా అని నిశ్చింతగా ఉన్నారట వాళ్ళు. నారాయణరావు గారు చెప్పారు.'' అని.

''నారాయణరావు తల్లా! అయ్యో ఎంత పొరబాటయింది. నేను ఎవరో అనుకున్నాను. చాలా మంచివాడు. అతను మనకు చాలా కావల్సినవాడు. నీకు గుర్తులేదూ అతను మనింటికి నాలుగైదు సార్లు వచ్చాడు కూడాను'' అన్నాడు అరవింద్.

'' ఏమోనండీ మనిషిని చూస్తే గుర్తుపడతానేమో'' అందామె.

''సరే అతనికి ఫోను చేశావుగా. నేనూ ఇప్పుడే వస్తున్నా'' అని ఫోను క్రెడిల్ చేశాడు అరవింద్. రాత్రి భార్య తనతో రానందుకు కోపం వచ్చినా ఆమెను వంటరిగా వదిలేసి వచ్చినందుకు తరువాత

పశ్చాత్తాపపడ్డాడతను. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు ఆసుపత్రికి బయలుదేరుదామా అనుకుంటుండగానే ఆమె ఫోన్‌కాల్ వచ్చింది అతనికి.

రత్నమాల బాత్‌రూమ్‌లో ఉంది. రామారావుగారు బాయ్‌చేత కాఫీ తెప్పించి తాగుతున్నాడు. అప్పుడు వచ్చారు అరవింద్, నారాయణరావులు.

''ఎలా ఉందమ్మా ఇప్పుడు'' అని పలుకరించాడు నారాయణరావు తల్లిని.

''బాగానే ఉందిరా. కొంచెం తల భారంగా ఉంది అంతే. ఆ తల్లి నన్ను రక్షించింది. ఆ పిల్ల లేకపోతే ఇవాల్టికి చచ్చి రెండోరోజయ్యేది. పెద్దాయన రామారావు గారు నాకోసం రక్తమిచ్చారు. ఆ అమ్మాయీ, వాళ్ళాయనా నన్నీ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ కుటుంబం రుణం మనమీజన్మలో తీర్చుకోలేం నాయనా! పెద్దమనసుగల తల్లి ఆమె. 'పది కాలాలపాటు ముత్తైదువగా పిల్లాపాపలతో. భోగభాగ్యాలతో సుఖంగా ఉండు తల్లీ' అని ఆశీర్వదించటం తప్ప ప్రతిగా మనమేం చెయ్యగలం ఆమెకి'' అంది ఆమె.

'' ఈయనే నారాయణ రావుగారు'' అంటూ పరిచయం చేశాడు అరవింద్ అప్పుడే గదిలోకడుగెడుతున్న భార్యకు.

''నమస్తే. ఆయన ఇందాక ఫోనులో చెప్పబట్టి గాని లేకపోతే గుర్తుబట్టలేకపోయేదాన్ని మిమ్మల్ని. అమ్మగారికి పెద్ద ప్రమాదం తప్పింది.'' అంది రత్నమాల.

''మా ఆవిడకు మనుష్యుల్ని గుర్తుపట్టని జబ్బుందిలెండి నారాయణరావుగారూ! ఓ సారి చూసినా గుర్తుపెట్టుకోదు'' అని జోక్ చేశాడు అరవింద్.

''అమ్మాయికి మనుషుల ముఖాలు కాదురా, మనుషులు గుర్తుంటారు. అది పెద్ద విషయం. నువ్వూ అది నేర్చుకో బాగుపడతావు'' అన్నాడు రామారావుగారు కొడుకుని సన్నసన్నగా చీవాట్లు వేస్తూ. ఆయనకు కొడుకు కోడల్నలా రాత్రి వంటరిగా, నిస్సహాయంగా వదలి రావటం ఇష్టం లేదు.

అరవింద్ ఆలోచనలో పడిపోయాడు 'తనభార్య రత్నమాల ఎంత ఔన్నత్యం గలిగిన వ్యక్తి. తనూ, తన తల్లి ఆమె మనుషుల ముఖాలు గుర్తుంచుకోనందుకు కోప్పడ్డారు. తనైతే కఠినంగా మాట్లాడాడు కూడా. తెలిసున్నముఖాలకే పరిచయస్తులకే సాయం చేయాలన్నతత్వం తమది. తన భార్య అలా కాదు ముఖాల వెనుక మనుష్యులే కాని, ముఖాలు తెలియవు ఆమెకు. మనుషుల అవసరాలు తప్ప, ప్రయోజనాలు గుర్తుండవు ఆమెకు. ఫలాపేక్ష లేని మనసు ఉన్నతమైంది. రత్నమాల నిజంగా జాతిరత్నమే. అలాంటి రత్నాన్ని దగ్గర ఉంచుకుని గాజు పూసగా ఎంచాడు తాను. ఎంత పొరబాటయింది? తండ్రి కోడల్ని త్వరగా గుర్తించాడు. తనే ఆలస్యం చేశాడు.

''వదిన గారూ! మీరందరూ చేసిన సాయానికి ఎలా కృతజ్ఞతలు తెల్పాలో అర్థం కావటం

లేదు. మా అమ్మ దిక్కులేని చావు చావకుండా కాపాడారు. మేం చేయలేని పని మీరు చేశారు'' అన్నాడు నారాయణరావు రత్నమాలతో.

''భలేవారే, మేం చేసింది పెద్ద ఘనకార్యమన్నట్లు మాట్లాడుతున్నారే. ఆ పరిస్థితిలో మీరయినా అదే చేసేవారు. నేను చేసిన ఘనకార్యం ఏమిటంటే అమ్మగార్ని గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్ళకుండా, ప్రైవేటు నర్సింగ్‌హోంలో చేర్పించి, మీకు వెయ్యి రూపాయలు బిల్లు చేయటం'' అంది రత్నమాల.

''డబ్బుదేం ఉంది. మనిషి ముఖ్యంగాని, మీకు రాత్రంతా నిద్రలేనట్లుంది. మీరు పదండి. మా ఆవిడ కూడా వస్తుంది ఇప్పుడు. ఇహ అమ్మ బాధ్యత మేం తీసుకుంటాం. అరవింద్, బాబాయిగారూ! మీరు కూడా లేవండి'' అన్నాడు నారాయణరావు.

''నాకేం తొందరలేదు. అబ్బాయీ! అమ్మాయిని ఇంటికి తీసుకెళ్ళరా. రాత్రంతా నిద్రలేకుండా మా ఇద్దరికీ సేవచేస్తూ కూర్చుంది. డాక్టరొచ్చింతర్వాత, ఆయన్తో మాట్లాడి నేనూ వస్తాను'' అన్నాడు రామారావు కొడుకుతో.

అందరికీ చెప్పి బయటపడ్డారు భార్యాభర్తా.

''సారీ! నిన్న మీకు సినిమాలేకుండా చేశాను. మీకు కోపమొచ్చింది కదూ! రాత్రంతా తిట్టుకునుంటారు'' అంది రత్నమాల ఆటోలో.

''నిజమే కోపమొచ్చింది రాత్రి. నిన్ను మనుషులను గుర్తుపట్టవని సాధించాను కానీ, అసలు విషయం నాకివాళ తెలిసింది, నేనే అసలు మనుషుల్ని గుర్తుపట్టనని. మన పెళ్ళయి ఇన్నిరోజులయినా నేను నిన్ను గుర్తుపట్టలేకపోయాను. రత్నా! ఐ మస్ట్ అపాలజైజ్ ఫరిట్.''

''బాగుంది. నన్ను మీరు గుర్తుపట్టలేక పోవటమేం. గుర్తుపడ్తారనేగా వరించి వరమాలను మీ మెళ్ళోవేసింది. మావాళ్ళు''

''మీ వాళ్ళ సంగతి సరే. నీ సంగతేమిటో చెప్పు''.

''మీకు రాత్రి కోపం వచ్చిందని తెల్సినా, ఏ ధైర్యంతో ఆగిపోయాను ఆసుపత్రిలో? మీ కోపం తాత్కాలికమేననీ, నేను చిన్నబుచ్చుకుంటే మీరు చూడలేరనీ నాకు తెల్సు. నేను ఫోను చేయకపోయినా పొద్దున్నే మీరు నాకోసం వస్తారనీ తెల్సు... ఇంకేం చెప్పాలబ్బా నా సంగతి.''

'' ఇంకేం వద్దులే రత్నా!'' అన్నాడు అరవింద్ ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకొని సుతారంగా నొక్కివదుల్తూ.

'ఈనాడు' ఆదివారం

12-3-1989